క్లుప్తంగా

వైద్య శిబిరం ఏర్పాటు



బ్రాహ్మణకొట్కూరు వద్ద కాలినడక భక్తులకు మందులు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ కేంద్రం వద్ద శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు తులసీరాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఆరోగ్య సిబ్బంది భక్తులకు ఉచితంగా మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేస్తారన్నారు.

శివనందీశ్వరుడికి 8న లింగోద్భవ రుద్రాభిషేకం

మహానంది: మహిమాన్వితమైన నవనందుల్లో ఒకటి శివనంది క్షేత్రం. బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామంలోని శివనందీశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 8న మహాలింగోద్భవం సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ శనివారం తెలిపారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామి వార్లకు 8వ తేదీన లింగోద్భవం పురస్కరించుకుని మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, 9న తెల్లవారుజామున కల్యాణోత్సవం పూజలు వైభవంగా జరుగుతాయన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



ఉత్తమ అంగన్‌వాడీ సహాయకురాలికి బహుమతి అందజేస్తున్న సీడీపీఓ

పాములపాడు: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సీడీపీఓ కోటేశ్వరమ్మ అన్నారు. శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. భ్రూణహత్యల కారణంగా అమ్మాయిల కొరత ఏర్పడుతుందని చెప్పారు. అనంతరం ఉత్తమ అంగన్‌వాడీ సహాయకురాళ్లు పద్మావతి, మరియమ్మ, చిట్టెమ్మ, చెన్నమ్మ, సువర్ణమ్మలను బహుమతు లతో సత్కరించారు. అనంతరం సీడీపీఓ, సర్పంచు మకల భాగ్యమ్మ, ఏసీడీపీఓ మంగవల్లి, ఏపీఓ విమలమ్మ, సూపర్‌వైజర్ లలిత ప్రభావతి, ఏఎన్‌ఎం అనురాధలను మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు సన్మానించారు.

ఏహెచ్ఏగా నియామకం




ఎంపీడీఓ కవిరాజుకు నియామక పత్రం అందజేస్తున్న గుండెపోగు చరిత

పగిడ్యాల: మండలంలోని కొత్త ముచ్చుమర్రి రైతు భరోసా కేంద్రంలో ఖాళీగా ఉన్న పశుసంవర్ధక సహాయకురాలుగా గుండెపోగు చరిత శనివారం నియమితులయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కలెక్టర్ నుంచి నియామక పత్రం అందుకున్న చరిత పగిడ్యాల ఎంపీడీఓ కవిరాజుకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. 2023 డిసెంబర్ 31న ఏహెచ్ఏ నియామక పరీక్షలో 65.14 శాతంతో ఉత్తీర్ణత సాధించింది. పేద కుటుంబంలో పుట్టిన తాను జగనన్న ప్రభుత్వంలో ఉద్యోగం సాధించడం ఎంతో సంతృప్తినిచ్చిందని చరిత తెలిపారు.

నాణ్యమైన ఆహారపదార్థాలను అందించాలి

మహానంది: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేలాది సంఖ్యలో మహానంది వచ్చే భక్తులకు నాణ్యమైన ఆహారపదార్థాలను అందించాలని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులతో శనివారం సాయంత్రం దేవస్థానం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ అన్నప్రసాద వితరణ కేంద్రాల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలన్నారు. వీలైనంతగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. సమావేశంలో ఏఈఓ ఎర్రమల మధు, జేఏ నాగమల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

శివస్వాముల సందడి



సేదతీరుతున్న శివ స్వాములు

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో ప్రారంభమైన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు శనివారం భారీ స్థాయిలో శివ స్వాములు శ్రీశైలం చేరుకున్నారు. ఇరుముడులతో మల్లన్నను దర్శించుకొని శివ దీక్షా శిబిరాలు, చంద్రావతి కల్యాణ మండపం, పార్కులలో ఏర్పాటు చేసిన షామియానాలు, చెట్లకింద సేద తీరారు. ఆయా ప్రదేశాల వద్ద దేవస్థానం మంచి నీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
- ఆత్మకూరు మున్సిపల్ భవనానికి రూ.3 కోట్లు మంజూరు



చెక్కులు అందుకున్న బాధితులతో ఎమ్మెల్యే శిల్పా



వైఎస్సార్‌సీపీలో చేరిన 6వ వార్డు నాయకులతో ఎమ్మెల్యే

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి నుంచి 24 బాధిత కుటుంబాలకు రూ.19.82 లక్షల సహాయం మంజూరైందని వివరించారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఏ నియోజకవర్గానికి అందనంత సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు శ్రీశైలం నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. ఆరోగ్య శ్రీ పథకం పేదలకు వరమని, గత టీడీపీ ప్రభుత్వంలో 1,047 వ్యాధులు మాత్రమే ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 3,600జబ్బులను చేర్చడం జరిగిందన్నారు. ప్రతి పేదవానికి వైద్యం అందించడమే తమ లక్ష్యమని, ఆరోగ్య శ్రీ క్రింద వర్తించని ఇతర జబ్బులకు సీఎం సహాయనిధి కింద నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

రూ.2కోట్లతో షాదీఖానా

ఆత్మకూరు పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా ముస్లిం కుటుంబాలు కలలుగంటున్న షాదీఖానా పూర్తి చేయడం జరిగిందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయడంతో త్వరితగతిన పూర్తి చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్ కోటి రూపాయలతో అభివృద్ధి చేశామని, ఈ నెల 3న ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేక నిధులు రూ.15లక్షలు మంజూరు చేయించి పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయం భవన నూతన నిర్మాణానికి రూ.3కోట్లు నిధులు మంజూరయ్యాయని, టెండర్లు పిలవడం జరిగిందని, కోడ్ రాకముందే భూమి పూజ చేస్తామన్నారు. వచ్చే 50 ఏళ్లలో పట్టణంలో పెరుగుతున్న ప్రజల అవసరాల నిమిత్తం భారీ స్థాయిలో నూతన మున్సిపాలిటీ కార్యాలయం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులను చూసి వచ్చే ఎన్నికల్లో తమను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తిక్‌రెడ్డి, పట్టణ మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ మీర్, బుచ్చయ్య చౌదరి, నాయకులు శ్రీనివాసరెడ్డి, అంబాల ప్రభాకర్‌రెడ్డి, దేశం తిరుపంరెడ్డి, బాలస్వామి యాదవ్, కుందూరు శివారెడ్డి పాల్గొన్నారు.

200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పట్టణంలో ప్రతిపక్ష టీడీపీ పార్టీకి శనివారం భారీ షాక్ తగిలింది. పట్టణంలోని 6, 13 వార్డులలో టీడీపీకి చెందిన 200 కుటుంబాలు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. 6వ వార్డుకు చెందిన పీరుసాహెబ్‌గారి నితిసా, ముర్తుజావలి, ఇస్మాయిల్, ఫరూక్, రహిమాన్, కమ్మద్దీన్, రుక్మొహిద్దీన్, అల్లావుద్దీన్, నూరి, జబీవుల్లా, బాషా, ఖాజామొహిద్దీన్, ఇనాయతుల్లా, మాజీత్, సనా అలీ, నూరుల్లా, ఇసాక్‌బాషా, 13వ వార్డుకు చెందిన మారుసాగారి మస్తాన్ అలి, రహం, మున్నా, మస్తాన్, ముర్తుజా, బాషా, ఫరూక్, గౌస్, జాకీర్, వలి, మౌలాలి, షఫీ, యూనిస్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ తాము ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు, పేద ముస్లింలకు అందిస్తున్న ఆర్థిక సహాయం పట్ల ఆకర్షితులై, ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీ చేరామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంజాద్ అలీ, జయకృష్ణ, చాపల రఫీక్, అహమ్మద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన 13వ వార్డు టీడీపీ నాయకులు

జగనన్న పాలనలో ముస్లింలకు పెద్ద పీట



మాట్లాడుతున్న డాక్టర్ దారా సుధీర్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్
- ముస్లింలకు రిజర్వేషన్ కల్పించింది వైఎస్సార్

నందికొట్కూరు: జగనన్న ప్రభుత్వం ముస్లింలకు పెద్దపీట వేసిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. దేశంలో ఎక్కడా ఏ రాష్ట్రంలో లేని విధంగా ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కిందన్నారు. శనివారం పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో 'హర్ దిల్ మే వైఎస్సార్- హమ్ సబ్ జగన్‌కే సాథ్' అనే కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ఇమామ్‌లు, మౌజన్, ముతవల్లిల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడంతో అనేక పేద ముస్లిం కుటుంబాలు అభివృద్ధి చెందాయన్నారు. ముస్లింల పిల్లలు ఉన్నత చదువులు చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగారని గుర్తు చేశారు. జగనన్న పాలనలో ముస్లింలు విద్యావంతులు, డాక్టర్లు, ఇంజినీర్లు, పెద్ద పెద్ద ఆఫీసర్లు అయ్యారని చెప్పారు. టీడీపీ పాలనలో ముస్లింలపై దేశ ద్రోహులుగా కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. ఇమామ్‌లకు, మౌజన్‌లకు ప్రతి నెల ఆర్థిక సాయం అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని స్పష్టం చేశారు. మళ్లీ వైఎస్ జగనన్న సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ముస్లిం సంప్రదాయ పద్ధతిలో డాక్టర్ దారా సుధీర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, కౌన్సిలర్లు హమీద్, రవూఫ్, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా ముస్లిం జోనల్ ఇన్‌చార్జ్ అబుబక్కర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, మన్సూర్, నజీర్ అహమ్మద్, శాలిబాషా, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జూపాడుబంగ్లా: ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం జూపాడుబంగ్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. సోషల్‌మీడియా మండల కన్వీనర్ పరిగె సుంకన్న అధ్వర్యంలో సీనియర్ నాయకుడు సూదిరెడ్డి రమేష్‌రెడ్డి శ్రీశైలం పాదయాత్ర భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు.

నందికొట్కూరు: సిద్ధార్థరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆర్ట్ శ్రీనివాసులు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మహిళల చేతుల్లో రూ. లక్షల ఆస్తి




మాట్లాడుతున్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పేదమహిళల చేతుల్లో రూ.లక్షల విలువ చేసే రిజిస్ట్రేషన్ పత్రాలను ఉచితంగా అందజేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు శనివారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. 1 నుంచి 8వ వార్డులకు చెందిన పేదలకు 682 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల ఉచిత రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ హయంలో పేదలకు సెంటు స్థలం కూడా ఇవ్వలేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు సీఎం వైఎస్ జగనన్న ఇస్తుంటే చంద్రబాబు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని గుర్తు చేశారు. కోర్టులో కూడా జగనన్ననే గెలిచి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పేదల చిరకాల చిరకాల కల నేరవేర్చారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిదేవి, కౌన్సిలర్లు సురేష్, చాంద్‌బాషా, రవూఫ్, కృష్ణ, హమీద్, చిన్నిరాజు, నాయకులు ఉస్మాన్‌బేగ్, రామకృష్ణ, రాజు, అబ్దుల్లా, శాలిబాషా తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నేరవేర్చడమే లక్ష్యం

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో జగనన్న ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎంపీడీఓ జవహర్ బాబు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఎంపీటీసీ స్రవంతి, జీ.వీరాపురం సర్పంచు బోరెడ్డి సరస్వతి, సచివాలయాల మండల కన్వీనర్ పి.నాగలక్ష్మిరెడ్డి, ముసలిమడుగు ఉపసర్పంచు నాగన్న ఉన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం



కొత్తపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

కొత్తపల్లి: ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం మండలంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గువ్వలకుంట్లలో ఎంపీడీఓ జవహర్‌బాబు, వీరాపురం సర్పంచు బోరెడ్డి సరస్వతి ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. ఆయా పీహెచ్‌ల వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు.

వెలుగోడు: ఈ నెల 3న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీలు చేపట్టారు. డాక్టర్ జహీర్ వలి, సూపర్‌వైజర్లు, ఏఎన్ ఎంలు పాల్గొన్నారు.

మిడుతూరు: పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మండలకేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కడుమూరు వైద్యాధికారి సురేష్ బాబు, డాక్టర్ రాజు, సీహెచ్ఓ రంగస్వామి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: 0–5ఏళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా రెండు పోలియోచుక్కలు వేయించాలని డాక్టర్ సభా తెలిపారు. శనివారం పల్స్‌పోలియో కార్యక్రమంపై జూపాడుబంగ్లా ప్రాథమిక వైద్యులు, వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

పాములపాడు: నిండు జీవితానికి పల్స్ పోలియో 2 చుక్కలు చాలని డాక్టర్ గులాబ్‌షా, ఆయుర్వేద వైద్యాధికారిణి సావిత్రి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు.

మహానంది: తిమ్మాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, వైద్యాధికారి ఫిరదౌష్ అన్నారు. పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. వైద్య అధికారులు షేక్షావలి, రవికుమార్, సుబ్బలక్ష్మి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెట్ల మార్గంలో నిరంతరం నీటి సరఫరా



భక్తులతో సంభాషిస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం సమీపంలోని కైలాసద్వారం–భీమునికొలను మెట్లమార్గంలో నిరంతరం మంచినీటి సరఫరా జరుగుతుండాలని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులను దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లలో భాగంగా శనివారం ఆయన కైలాసద్వారం, భీమునికొలను మెట్ల ప్రారంభ ప్రదేశం తదితర ప్రాంతాలలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. పలువురు పాదయాత్ర భక్తులతో సంభాషించి ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులందరు ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కైలాసద్వారం, పరిసరాలు, భీమునికొలను మెట్ల ప్రారంభ ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. ఏఈలు రాజేశ్వరరావు, సీతారమేష్, రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన శిబిరం ప్రారంభం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలక్షేత్ర పరిధిలో పలుచోట్ల భక్త బృందాలు, స్వచ్ఛంద సేవకులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శనివారం పాతాళగంగ మార్గంలో వికారాబాద్‌కు చెందిన సాయి హోమ్స్ అండ్ డెవలపర్స్ శంకర్‌యాదవ్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. పర్యావరణ పరిరక్షణకు, క్షేత్ర సుందరీకరణలో భాగంగా ఆలయ సమీపంలోని పాత పుష్కరిణి వద్ద కొబ్బరి, పనస, మామిడి మొదలైన మొక్కలను నాటారు. దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు పుష్కరిణి వద్ద కొబ్బరి మొక్కలు నాటారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పగిడ్యాల: పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామసభలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను ప్రశాంతంగా పరిష్కరించుకోవాలని కక్షలు పెంచుకోరాదన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. రౌడీషటర్లు, డెకాయిట్స్ కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్ భాస్కర్, ఎస్ఐ జయశేఖర్ తదితరులు ఉన్నారు.

చిరుత దాడిలో మూడు జీవాలు మృతి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని బండ్లబజార్ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి చిరుత ఓ ఇంటి పెరట్లో ఉన్న మూడు జీవాలను బలిగొంది. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని రాగూరి.వెంకటశ్రీనుకు చెందిన రెండు గొర్రెలు, ఒక పొట్టేలును చంపి మాంసం తినింది. ఈ ఘటనలో సుమారు రు.30,000 నష్టం వాటిల్లినట్లు, అటవీశాఖ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు శ్రీను కోరుతున్నాడు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు మదన్, ఠాగూర్ తదితరులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేశారు. అయితే గ్రామంలోని నివాసప్రాంతంలోకి చిరుత ప్రవేశించి దాడి చేయడంతో ఆప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

5న సర్వసభ్య సమావేశం

వెలుగోడు: ఈ నెల 5వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యద్ ఉమర్ తెలిపారు. ఎంపీపీ లాలం రమేష్ అధ్యక్షతన మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీటీసీలు, పంచాయతీల సర్పంచులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మిడుతూరు/మహానంది: ఆదర్శ పాఠశాలలో ఆరో తర గతి ప్రవేశాలకు (2024–25) విద్యా సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాళ్లు సలీంబాషా,లక్ష్మణరావు తెలిపారు. శనివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21వ తేది ఉదయం 10 నుంచి 12 గంటల వరకు స్థానిక ఆదర్శ పాఠశాలలో (ఐదో తరగతి స్థాయి సిలబస్) తెలుగు/ఆంగ్లం మీడియంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులు

అవి-ఇవి

రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు ఏపీ మోడల్ స్కూలు, సెల్ నంబర్ 9398421521 సంప్రదించాలన్నారు.

తలముడిపిలో చోరీ

మిడుతూరు: మండలపరిధిలోని తలముడిపి గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన మహమ్మద్ గౌస్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదుకు నెల రోజుల క్రితం వెళ్లారు. శుక్రవారం సాయంత్రం తలముడిపి గ్రామానికి చేరుకున్నారు. ఇంటికి చేరుకున్న వారు ఇంటిలోని సుమారు 11 తులాల బంగారం, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నందికొట్కూరు రూరల్ సీఐ ఆధ్వర్యంలో 2 ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రేపు నంద్యాలకు మహానందీశ్వరస్వామి

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ మహానందీశ్వరస్వామి పెళ్లిపెద్దలైన శ్రీ పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామి వార్లను ఆహ్వానించేందుకు మహానందీశ్వర దంపతులు సోమవారం నంద్యాలకు బయలుదేరనున్నారు. ఆనవాయితీలో భాగంగా ప్రతి ఏడాది పెళ్లి పెద్దలైన బ్రహ్మనందీశ్వరస్వామి దంపతులు దగ్గరుండి మహానందీశ్వరుడి శివరాత్రి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవం, రథోత్సవం, నిర్వహించి త్రిశూల స్నానం అనంతరం తిరిగి నంద్యాలకు వెళ్తారు.

నిత్యం తాగునీటి పరీక్షలు నిర్వహించండి

జూపాడుబంగ్లా: ప్రతి నిత్యం గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులు, బోర్ల వద్ద గ్రామపంచాయతీ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్యసిబ్బంది తాగునీటి పరీక్షలు నిర్వహించాలని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఒకటి చొప్పున మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు 12 తాగునీటి పరీక్షాకిట్లు మంజూరైనట్లు తెలిపారు. నీటిపరీక్షా కిట్లను వినియోగించి నిత్యం తాగునీటి పరీక్షలు నిర్వహించి అందులో నిర్ణీతమోతాదులో లవణాలు ఉన్నాయా లేదా అనే వివరాలు నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. నిర్ణీత మోతాదు కంటే అధిక మోతాదులో లవణాలుంటే ఆ నీరు తాగేందుకు పనికిరానిదిగా నిర్ధారించి ప్రజలకు తెలియజేయాలని సంబంధింత సిబ్బందికి సూచించారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి

పాములపాడు/కొత్తపల్లి: రైతులు పండించే ప్రతి పంటకు ఈ క్రాప్ బుకింగ్ తప్పని సరి అని ఓఏలు ఫణీశ్వరరెడ్డి, మహేష్, కొత్తపల్లి ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. శనివారం పాములపాడు మండలంలోని మిట్టకందాల, కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామాల్లో ఈ క్రాప్ బుకింగ్ తనిఖీపై గ్రామసభలు నిర్వహించారు. ఈ క్రాప్ బుకింగ్ రైతుల ముసాయిదా జాబితాను ఆర్బీకేలో ప్రదర్శించారు. అలాగే జాబితా చదివి వినిపించారు. ఏమైనా అభ్యంతరాలుంటే మార్చి 5వ తేదీలోపు రాతపూర్వకంగా తెలియజేయాలని, వాటిని సరి చేసి 7వ తేదీలోపు తదుపరి జాబితాను విడుదల చేస్తామని వివరించారు. వ్యవసాయ సహాయకులు షబ్బీర్, పంచాయతీ కార్యదర్శి చాందిని వీఆర్ఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్‌పై రైతులకు ఏమైనా అభ్యంతరాలుంటే ఆర్బీకేల్లో లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చనని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. ఈక్రాప్ బుకింగ్‌కు జాబితాను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు.

వెలుగోడు సమీపంలో పెద్దపులి

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని నల్లకాల్వ సమీపంలో ఉన్న వైఎస్సార్ స్మృతివనం వద్ద ఓ పెద్దపులి రోడ్డు పక్కన నక్కి ఉన్న దృశ్యం ఆ దారిన వెళ్తున్న ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులకు కనువిందు చేసింది. వైఎస్సార్ స్మృతివనం సమీ పంలోని వెలుగోడు నార్త్ బీట్‌లో బండ్లకుంట ప్రాంతంలో వెలుగోడు–ఆత్మకూరు తాగునీటి పథకం పైప్‌లైన్ ప్రెషర్ రిలీజ్ ఓపెన్ వద్ద లీకేజి ఉంటుంది. ఈ లీకేజ్ ఓ చిన్న పాటి మడుగులా ఉంటుంది. ఈ మడుగు వద్ద దుప్పులు, జింకలు, మనిమేగాలు దాహం తీర్చుకుంటుంటాయి. శనివారం ఉదయం పెద్దపులి ఒకటి ఈ మడుగు వద్ద నీళ్లు తాగేందుకు వచ్చిన దుప్పుల మందపై కన్ను వేసి రోడ్డుకు ఈవలి వైపు పొంచి ఉంది. అదే సమయంలో నంద్యాలకు వెళుతున్న బస్సులోని ప్రయాణికులకు స్పష్టంగా పెద్దపులి కనిపించింది. కొద్ది సేపట్లోనే ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఎవరూ ఫొటోలు, వీడియోలు తీయకపోవడం గమనార్హం. విషయం తెలిసిన వెలుగోడు నార్త్ బీట్ అధికారులు, స్మృతివనం సిబ్బంది పులి కనిపించిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పులి అక్కడికి వచ్చినట్లు, దుప్పులను వెంటాడినట్లు అధికారులు గుర్తించారు. పులి దుప్పులను వెంటాడుతూ అడవిలోకి వెళ్లినట్లు అక్కడి పాద ముద్రల ఆధారంగా నిర్ధారించారు.

91.52 శాతం పింఛన్ల పంపిణీ



గుంటూరులో లక్ష్మమ్మకు నగదును అందజేస్తున్న వలంటీర్ షేక్షావలి

జూపాడుబంగ్లా: మార్చి నెలకు సంబంధించిన పింఛన్ మొత్తాన్ని వలంటీర్లు శనివారం సాయంత్రానికి 91.52 శాతం పంపిణీ చేసి జిల్లాలో మండలాన్ని ఆరో స్థానంలో నిలిపినట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. మండలం వ్యాప్తంగా 5,130 పింఛన్లు రాగా సాయంత్రం 5గంటల వరకు 4,695 మందికి పంపిణీ చేసి 91.52శాతం పూర్తి చేశారన్నారు.

గుంటూరు వెళ్లి..

శ్రీశైలంప్రాజెక్ట్: సామాజిక పింఛన్ లబ్ధిదారురాలు గోదా లక్ష్మమ్మ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటుంది. విషయం తెలుసుకున్న సచివాలయం–3 వలంటీర్ షేక్షావలి శనివారం ఉదయం గుంటూరు ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశాడు.

నిజాయితీ చాటుకున్న భక్తులు



పర్సును భక్తురాలికి అందిస్తున్న దృశ్యం

మహానంది: హైదరాబాద్‌కు చెందిన సుశీలమ్మ శనివారం స్వామివార్ల దర్శనానికి వెళ్లిన సమయంలో పర్సును పోగొట్టుకుంది. ఆలయానికి వచ్చిన భక్తులు బసవరాజు, శివలకు ఆ పర్సు దొరికింది. వారు దానిని సమాచారం కేంద్రంలో అప్పగించారు. విషయాన్ని మైకుల ద్వారా అనౌన్స్ చేయడంతో బాధితురాలు సుశీలమ్మ సమాచారం కేంద్రం వద్దకు చేరుకోగా ఆలయ ఇన్‌స్పెక్టర్ రంగన్న, ఏజేన్సీ ఉద్యోగి మధు పర్సును అందించారు. పర్సులో రూ. 4వేలు నగదు, గుర్తింపు కార్డులు ఉన్నట్లు ఆమె తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ సమీపంలోని పంటపొలాల్లో జరుగుతున్న పేకాట స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించి తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. నంద్యాలకు చెందిన ప్రవీణ్‌కుమార్, మౌలాలితో పాటు మరో ఏడుగురిని అరెస్ట్ చేసి రూ. 80వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

దేవస్థానం అధికారులకు పదోన్నతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. పర్యవేక్షకులు జి.స్వాములకు సహాయ కార్యనిర్వహణాధికారిగా, సీనియర్ అసిస్టెంట్ డి.స్వర్ణలతకు పర్యవేక్షకురాలుగా, ఎల్.డి. టైపిస్ట్ జగదీశ్‌రెడ్డికి సీనియర్ అసిస్టెంట్‌గా, జూనియర్ అసిస్టెంట్ కె.బ్రహ్మయ్యకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించినట్లు దేవస్థాన వర్గాలు తెలిపారు.